కాలానుగుణంగా మహిళల్లో చైతన్యం



సరస్వతీ విద్యా మందిర్‌లో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చందానగర్ డివిజన్ పరిధిలోని సరస్వతీ విద్యా మందిర్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎంవీఆర్ గ్రూపు సంయుక్తంగా వేడుకలను నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ దేవారెడ్డి విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ.. కాలానుగుణంగా మహిళల్లో చైతన్యం కనిపిస్తుందని, నేటి స్త్రీ తనను తాను నిర్మించుకుంటుందన్నారు. ఉద్యోగ రంగం, వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ రంగంలోనూ తన శక్తి సామర్థ్యాలను నిర్భయంగా ప్రదర్శించుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా ఎంవీఆర్ గ్రూప్ చైర్మన్ మూలా వెంకటేష్‌గౌడ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్‌లు పాల్గొన్నారు. అనంతరం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో 80 మంది మహిళా నేతలను శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గొట్టిముక్కల బ్రహ్మానందం, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి, వరలక్ష్మి, సుభద్ర, కల్పన, అమ్మయ్య చౌదరి, వేంకటేశ్వర్లు, పాలం శ్రీను, శ్రీనివాస్ తదితరులున్నారు.

‘పేస్ యూరాలజీ కాన్‌క్లేవ్ - 2024’



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వంబర్‌నాథ్

మాదాపూర్: రోగులకు చికిత్స అందించడంలో అత్యున్నత నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానంతో సేవలను పేస్ హస్పిటల్స్ అందిస్తున్నాయని ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ విశ్వంబర్‌నాథ్ తెలిపారు. మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో పేస్ యూరాలజీ కాన్‌క్లేవ్–2024ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగంలో ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలన్నారు. అధునాతన సంక్లిష్టమైన మూత్ర పిండాల శస్త్రచికిత్స విధానాలు, రోబోటిక్స్, లాపరోస్కోపిక్ యూరాలజీ, కిడ్నీస్టోన్స్ కోసం మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ, కిడ్నీ చికిత్సలోని వివిధ సవాళ్లకు సంబంధించిన ఆయా రంగాల్లోని ప్రముఖ నిపుణులు వారి సూచనలు, సలహాలిచ్చారు. ఎబీఓ, అనుకూలత, పీడియాట్రిక్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియోలాజికల్ ఇంటర్వెన్షన్లతో సహా మూత్ర పిండాల మార్పిడి శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుజాత, డాక్టర్ శ్యామ్‌వర్మ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విశాఖపట్నం నుంచి వచ్చిన కళారాధన మ్యూజిక్, డాన్స్ అకాడమీ గురువు డాక్టర్ తాళ్లపాక సందీప్‌కుమార్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. పుష్పాంజలి, మూషికవాహన, ముద్దుగారే యశోద, శివతాండవం, మహాగణపతి, కాలభైరవాష్టకం, జయము జయము, అన్నమాచార్య కీర్తనలు, కళాపూజ, జగన్మోహన, దుర్గస్తుతి, అభంగ్, హనుమాన్ చాలీసా తదితర అంశాలను కళాకారులు ఆరాధ్య, శ్రీవల్లి, సంయుక్త, హాసిక, మోహిని, లేఖ్య, తన్మయి, జ్ఞాపక, నేహశ్రీ, సంజన పాల్గొని ప్రదర్శించారు.

నీటి ఎద్దడిని నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ సభ్యులు

మణికొండ: వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అధ్యక్షుడు డి. సీతారాం అధ్యక్షతన సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నూతన రిజర్వాయర్లను అందుబాటులోకి తీసుకురావాలని, నీటి కనెక్షన్ ఉన్న ప్రతి ఇంటికి తక్షణమే క్యాన్ నంబర్లు ఇవ్వాలని జలమండలి అధికారులను కలిసి కోరాలని సభ్యులు నిర్ణయించారు. అలాగే మురుగు నీరు పందెన్‌వాగులో కలవకుండా మున్సిపాలిటీ బయటకు తరలించేలా సమగ్ర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఫ్రెండ్స్ కాలనీ నుంచి యూనియన్ బ్యాంక్ చౌరస్తా వరకు, మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ట్రయల్స్ విల్లాల వద్ద బాక్స్ డ్రైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని మున్సిపాలిటీ అధికారులు పరిష్కరించాలన్నారు. ఇంటి పన్ను మదింపులో అవకతవకలు ఉన్నాయని, నూతన విధానంతో వేలాది రూపాయల పన్నులు వస్తున్నాయని, వాటిని సరిదిద్దాలని కోరారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతించారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా వైన్స్‌లు, బార్‌లను ఏర్పాటు చేస్తున్నారని, వాటిని జనావాసాలకు దూరంగా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ మరియమ్మనగర్‌కు చెందిన ఎస్.నర్సింహచారి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను సంప్రదించారు. వెంటనే ఆయన నర్సింహచారితో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు ఆదివారం మంజూరైన రూ.2.5లక్షల ఎల్‌ఓసీని లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, బాషిపాక యాదగిరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యకాలనీ సమస్యలను పరిష్కరిస్తా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీవాసులతో కలిసి ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదిత్యనగర్ కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణనలోకి తీసుకొని వారి విజ్ఞప్తి మేరకు కాలనీలో పాదయాత్ర చేపట్టామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. సంతులిత, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

- అదేవిధంగా కాలనీవాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కాలనీ వాసులందరి సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపి, అశోక్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, విజయ్, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

‘అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్’ ప్రారంభమెప్పుడో ?

ఎన్నికల కోడ్ అమలుతో వాయిదా • సగం మేర మాత్రమే పనులు పూర్తి





గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ వరకు ఇలా..

రాయదుర్గం: నగరశివారు, ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి మరో మణిహారంగా చెప్పుకునేలా ‘అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్’ ఎప్పుడు ప్రారంభమవుతుందోనని సందేహం ప్రజలందరిలో కలుగుతోంది. సామాన్య ప్రజలు, ఐటీ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం వేళల్లో సేద తీరేందుకు ప్రత్యేక స్థలంగా గుర్తింపు సాధించనుంది.

- ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌ఐఐసీ), ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) సంయుక్తంగా ప్రకాష్ ఆర్ట్స్ సంస్థతో కలిసి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిన అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్‌ను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అధికారికంగా ప్రారంభం కాకుండానే ఇప్పటికే చాలామంది ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం దీన్ని వినియోగించడం విశేషం. గతేడాది ఏప్రిల్‌లో ప్రారంభించాల్సి ఉన్నా.. ప్రస్తుతం జూన్ 4 వరకు ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో వాయిదా పడింది.

మనస్సుకు హత్తుకునేలా..

‘అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్’ అంతా పచ్చదనంతో కనిపించేలా మొక్కలతో పాటు పలు రకాల పూలమొక్కలను కూడా నాటించి పెంచుతున్నారు.

- ఈ మొక్కలకు నీటిని డ్రిప్ ద్వారా లభించేలా ఏర్పాట్లు చేశారు, తద్వారా నిరంతరం ఎంత కావాల్సినంత నీరు అందేలా చేసి పచ్చదనంతో కూడిన వాతావరణం ఏర్పడేలా చేశారు.
- ఆకర్షణీయమైన పచ్చదనంతో పాటు రకరకాల పూలమొక్కల్లో లాంటానా కెమెరాల్లో, ల్యూకోఫిలమ్‌ఫ్రుటెస్సెన్స్, జట్రోఫా పాండురిఫోలియా, టెకోమారియా కాపెన్సిస్ ఆరెంజ్, పిసోనియా ఆల్బా, డురాంటా గోల్డియానా వంటి పేర్లతో ఉన్న మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- తొలివిడత పనులు ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి ఐఎస్‌బీ ఇన్ఫోసిస్ మీదుగా విప్రో సర్కిల్ వరకు ఉన్న ప్రాంతంలో పూర్తి చేసి గ్రీనరీ ఏర్పాటు చేశారు.

సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ పూర్తి..

- అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్ ఏర్పాటులో భాగంగా వాకింగ్, సైక్లింగ్ చేసేందుకు కూడా ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. అనధికారికంగా కొందరు వినియోగిస్తున్నారు.
- రెండో విడతలో విప్రో సర్కిల్ నుంచి వరుణ్ మోటార్స్ వరకున్న ప్రాంతంలో సైకిల్‌ట్రాక్, వాకింగ్‌ట్రాక్, గ్రీనరీని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్ ప్రత్యేకతలు..

గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి ఇన్ఫోసిస్, విప్రో సర్కిల్, కపిల్ టవర్స్, క్యాప్ జెమిని మీదుగా వరుణ్ మోటార్స్ వరకు రోడ్డులో 3.5 కిలోమీటర్ల పొడవు, 4.5 మీటర్ల వెడల్పుతో దీన్ని నిర్మించారు.

- పది మీటర్ల దూరంలో ఒకటి ఆర్నమెంటల్ స్ట్రీట్ లైట్ల ఏర్పాటు. కనీసం మూడు చోట్ల సైకిల్ పార్కింగ్‌కు ఏర్పాట్లు ప్రతిచోట అందుబాటులో పది సైకిళ్లు ఉండేలా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్ పొడవునా ఆకర్షణీయంగా పూలు, ఆకట్టుకునే మొక్కలు, లాన్‌ను ఏర్పాటు చేశారు.
- 75 వరకు పూల కుండీలు వర్టికల్ గార్డెన్, డస్ట్‌బిన్లు అందుబాటులోకి తీసుకురావడం.
- 4 చోట్ల ఫుడ్‌కోర్టులు, ఏటీఎంలు, మొబైల్ చార్జింగ్ పాయింట్లు, కియోస్క్, కాఫీషాప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా టీఎస్‌ఐఐసీ అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభినందన



జెరిపాటి జైపాల్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర వడ్డెర సంఘం సభ్యులు

హఫీజ్‌పేట్: తెలంగాణ రాష్ట్ర అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా జెరిపాటి జైపాల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించారు. ఆదివారం చందానగర్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర వడ్డెర సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కాంగ్రెస్ నేతలు జెరిపాటి రాజు, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు జె.సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షులు అనంతయ్య, కిష్టయ్య, చంద్రయ్య, పెంటేష్, వెంకటస్వామి, భూమేష్, రాములు, శ్రీరాములు, కతలు, మోహన్‌కుమార్, అనంతరావు, లక్ష్మీనారాయణ, తిమ్మయ్య, కొండయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మియాపూర్: సుప్రీంకోర్టు స్టేటస్ – కో ఉన్న భూముల్లో చేపడుతున్న నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మియాపూర్‌లోని 100 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమి సుప్రీంకోర్టు గత 25 ఏళ్ల క్రితం స్టేటస్ – కో విధించింది. ఈ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధన ఉన్న కొంత మంది వ్యక్తులు నిబంధనలను భేఖాతర్ చేసి దానిని ఐదంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామంలో జరిగిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, కొండపోచమ్మ అమ్మవారి 24వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సుధారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా పోచమ్మ జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామంలో ఆదివారం గాలి పోచమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

‘హిందుత్వం’ మతం కాదు

బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: హిందుత్వం అనేది ఒక మతం కాదని, దేశంలోని కొన్ని వర్గాలను కలిపే ఒక వారధి అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయదుర్గంలోని విస్పర్‌వ్యాలీలో ఆదివారం అల్పాహార సమావేశంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు అనంతరం మాట్లాడుతూ.. హిందుత్వం కోసం ఒక్కొక్కరు ఒక్కొక్కటి చెప్తారని అవేమీ సరికావని, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ చెప్పేవే సరైనవన్నారు. రామమందిర నిర్మాణం కోట్లాది మంది భారతీయుల కల అని పేర్కొన్నారు. ఆ కలను ప్రధాని నరేంద్రమోదీ సాకారం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మందిర నిర్మాణానికి దేశంలోని కోట్లాది మంది ప్రజలు తమ వంతుగా విరాళాలు అందించారన్నారు. ధనిక, పేద పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ మహత్తర ఘట్టంలో పాలు పంచుకున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆ శ్రీరామచంద్రుడి దర్శనం కోసం వెల్లువలా తరలి వెళ్తున్నారన్నారు. ప్రధాని ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, జాతీయ స్థాయిలో స్థిరమైన ప్రభుత్వం ఉంటే ధృఢమైన నిర్ణయాలు తీసుకుంటారనేందుకు బీజేపీ పరిపాలన నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చేవెళ్లలో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పలువురు బీజేపీ నేతలు, విస్పర్‌వ్యాలీ వాసులు పాల్గొన్నారు.



గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన

మదాపూర్‌లోని హైటెక్స్‌లో గ్రామీణ భారతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శనలో రేషన్ బయో ఉత్పత్తులను ఆసక్తిగా తిలకిస్తున్న నగర ప్రజలు

ప్రత్యేక పూజలు



శేరిలింగంపల్లి: ఆదర్శనగర్‌లోని శ్రీ విజయ దుర్గా భవానీ ఆలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం జరిగిన పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్, శేరిలింగంపల్లి స్థానిక నేతలు ఎల్లేష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గుణశేఖర్, బాబు, సత్యకుమార్, ధర్మరాజు, అశోక్, శ్రీను, మహేష్, సురేష్, మురళి, అశోక్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

అండగా నిలిచే పార్టీకే మా మద్దతు



పటాన్‌చెరు: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కార్మిక రంగానికి అండగా నిలిచే పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హెచ్‌ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్‌లో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈఎస్‌ఐ సంస్థలో కార్మికుల కష్టార్జితంతో పోగు చేసుకున్న రూ.2000 కోట్ల ఫిక్స్ డిపాజిట్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మిక రంగం ఉనికికి ప్రశ్నార్థకంగా మారిన నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతి కార్మికుడికి రూ.10,000 వేల పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ నర్సయ్య, జనరల్ సెక్రటరీ రెబ్బ రామారావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి భాగ్యవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వాల్ రైటింగ్స్, పోస్టర్ల తొలగింపు

శేరిలింగంపల్లి: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రోడ్లపై ఉన్న రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్స్, వాల్ రైటింగ్‌ను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భారతీనగర్ డివిజన్ల పరిధిలోని రోడ్లపై ఉన్న కటౌట్స్, వాల్ పోస్టర్స్, వాల్ రైటింగ్‌లను తొలగించే పనుల్లో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం సాయంత్రం నుంచే వాటిని తొలగించే పనులు చేపట్టినట్లు శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని 7 ప్రదేశాల్లో వాల్ రైటింగ్స్, 43 పోస్టర్స్, 11 ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు, 7 ప్రదేశాల్లో తోరణాలను తొలగించినట్లు వివరించారు. సోమవారం వరకు పూర్తికి తొలగిస్తామని ప్రకటించారు.

నిట్- పాట్నాకు విద్యార్థుల టూర్



బిహార్‌లో పర్యటించనున్న విద్యార్థుల బృందం

రాయదుర్గం: యువ సంఘం ఫేజ్–4 కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుంచి బిహార్‌కు విద్యార్థులు ఆదివారం పయనమయ్యారు. మంగళవారం నుంచి ఈనెల 23 వరకు బిహార్‌లో విద్యార్థులు పర్యటించనున్నారు. బీహార్‌లోని నిట్–పాట్నా, హెచ్‌సీయూ ఈ కార్యక్రమానికి సమన్వయం చేస్తారు. ఈ యాత్రలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 45 మంది విద్యార్థులు, హెచ్‌సీయూ నుంచి ఇద్దరు ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ వంశీ, డాక్టర్ నరేష్, ఇద్దరు సహాయక సిబ్బంది శ్రీశైలం, రాజేష్ పాల్గొంటున్నారు. ఆదివారం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

పటాన్‌చెరు టౌన్: భూసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజిద్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రామిక భవన్‌లో సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజిద్ అలీ మాట్లాడుతూ..పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల, రామచంద్రాపురం మండలాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో భూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. దీంతో వెంటనే స్పందించి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నాగేశ్వరరావు, అర్జున్, రామచంద్రమూర్తి, విశాల్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను ఎస్సీ డిపార్టుమెంట్ టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దండోరా నర్సింహ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు బంగారిగాళ్ల శ్రీనివాస్, వెంకటేష్, బంగారిగాళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మల్లేపల్లి లక్ష్మమ్మ–శంకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. మాజీ సర్పంచ్‌లు కిష్టోఫర్, కుమార్‌గౌడ్, కౌన్సిలర్ లచ్చిరాంనాయక్, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, వడ్డే నర్సింహులు పాల్గొన్నారు.

నకిలీ ఓట్లను తొలగించాలని వినతి

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలో ఉన్న నకిలీ ఓట్లను తొలగించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజాకు ఆదివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నాలుగు నెలల వ్యవధిలో వివిధ కారణాలతో 15 వేలకు పై చిలుకు ఓట్లను తొలగించినట్లు తెలిపారు. కొందరు తమ ఉనికిని కాపాడుకోవడానికి బొల్లారం, పటాన్‌చెరు, పాశమైలారం పారిశ్రామిక వాడల్లో రెండు చోట్ల ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. వాటిని వెంటనే తొలగించి తాజాగా ఓటరు జాబితాను తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్, యువరాజ్ మోరే కుంచాల కిషన్, తిరుపతిరెడ్డి, రతన్ సింగ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో గుమ్మడిదల తహశీల్దార్ గంగాభవాని ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించారు. అదేవిధంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. గోడల మీద ఉన్న రాతలను తుడ్చివేయించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా ప్రతిఒక్కరూ అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన తిరుమల్ రెడ్డి(41) ప్లంబర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇస్నాపూర్ నుంచి పోచారానికి బైక్‌పై వస్తుండగా, అదే సమయంలో ఎదురుగా బాచుపల్లి నుంచి ఇస్నాపూర్ వైపు బైక్ పై వస్తున్న తిరుమల్ రెడ్డి ఇతడి బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ తిరుమల్ రెడ్డిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య రాధిక ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు చోరీకి గురైన ఘటన రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో నివసించే శ్రీను పట్టణంలోని రాయసముద్రం చెరువులో రెండున్నరేళ్లు చేపల కాంట్రాక్టు తీసుకున్నాడు. రాత్రి సమయంలో చెరువులోని చేపలను ఎవరైన దొంగలిస్తారేమోనని అనుమానంతో ఆదివారం తెల్లవారుజామున తన కారులో రాయసముద్రం చెరువు కట్టపైకి వెళ్లి కారును ఆన్‌లో ఉంచి చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న క్రమంలో గమనించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి కారుతో ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.